# మొక్కుబడి

"ఈ పొద్దు గోడ పనై పోతాది. ఇయేళ ప్లీడరుబాబు డబ్బు ఇచ్చేస్తారు" అని మధ్యాహ్నం అంబలితాగుతూ పైడితల్లి పెళ్ళాంతో చెప్పేడు. ప్లీడరుగారిదొడ్డిగోడ కంట్రాక్టుగా కట్టడానికి పైడితల్లి ఒప్పుకున్నాడు. చెప్పుకోదగ్గ పనివాడు. అవలీలగా పని పూర్తిచేశాడు. మేస్త్రీలకీ, కూలీలకి పోను పది, పదిహేను రూపాయిలు మిగులుతాయి.

డబ్బు అందుతుందనగానే అంకి మొహం విప్పారింది. వాళ్ళగుడిసె ఎప్పుడూ పూటభత్యం, పుల్లవెలుగూ. అలాగ కాకుండ ఈ మారు పది రూపాయిల సొమ్ము ఒక్కసారి చేతిలో పడుతుంది. అంకికి ఊహలు ఉద్దేశాలూ ఎన్నెన్నా ఉన్నాయి.

అంకి ఆలోచించింది. సంసారానికి కావలసినవి ఎన్నో ఉన్నాయి. మంచినీళ్ళ కడవ కొనాలి. అమ్మవారి పండుక్కి నలుగురు చుట్టాలొస్తే ఆటొచ్చే దాకలు కొనాలి. చలికాలంలో కప్పుకోడానికి పచ్చడం కొనాలి. పిల్లకి మాయ వెండిసరుకులు కొనాలి. ఇంకెన్నో ఆలోచించింది. ఆఖరుకి "ఈపాలికి కొండెక్కాలి" అని మొగుడితో చెప్పింది.

"కోయిటోడి బాకీ పదిరూపాయలు ఆడికియ్యకపోతే ఆడు పిలక జాడిస్తాడు!" అన్నాడు పైడితల్లి.

"కోయిటోడి బాకీ రెండురూపాయిలే. ఎలాగైనా తీర్చొచ్చునే!"

"పదిరూపాయిలని నువ్వే సెప్పినావు?"

"ఔను. పదిరూపాయిలే, మొన్న మా యమ్మొచ్చి ఎనిమిది రూపాయలు సేతులెట్టింది. కోక కొనుక్కోయే అంది. కోయిటోడి కిచ్చేసినాను."

"నాకు సెప్పకుండా ఆడి కెందు కిచ్చేసినావు?"

"ఆడడ్డమైన మాటలూ అంటే వొళ్ళు మండి ఇచ్చేసినాను."

"నాతో సెప్పవలసింది!"

"ఎందుకూ?"

"నాను సారకోసం రెండు రూపాయిలు బాకీపడ్డాను."

"ఆమాట సెప్పితే ఇవ్వకపోదునా? ఓలమ్మ కొడక, ఏటో అనుకు న్నాను. ఇంకా కోక తెద్దు నంటా దనుకున్నాను! సారా బాకీకా, మా పుట్టింటో రిచ్చిందీ తాగిదామనుకున్నావా?"

"తాకూ్కడదేటి?"

"తాగుదువుగాని. ఈపాలి కొండెక్కాలి. ఎ్రులకి పోకు!" అన్నాది. పైడితల్లి గణింపు మంచిదే. రోజూ నాలుగు రూపాయలు శేస్తాడు కాని తాగే స్తాడు. అతనికి కల్లు తాగడం గొప్ప. తాగగా మిగిలిన డబ్బులు పెళ్ళాంకి సంసారంకింద ఖర్చు పెట్టమని ఇచ్చేస్తాడు. అంకి సంసారాన్ని పొదుపు చేసి వెయ్యి కూడికలు చేసి అందులోనే మొగుడికి తెలియకుండా పావలా, బేడా వెనకేసి డబ్బు చేస్తుంది. పుట్టింటి పేరు చెప్పి సమయా సమయాల్లో సంసారానికే ఖర్చు పెడుతుంది. ఆ బాపతు డబ్బుతో కోమటిబాకీ తీర్చే సింది.

"ఇంకా అంబలి కానేదురా?" అంటూ అసిరిగాడు లోపలకొచ్చాడు.

"ఓ రుంద్ర వొత్తాను!" అన్నాడు పైడితల్లి. ఉన్న అంబలంతా జుర్రేసి గట్టిగా తేన్చి లేచాడు.

గుడ్డ ఉయ్యాల్లో వెచ్చగా పడుకొని నిద్రపోతున్న పిల్లడు "ఎ౯ఎ౯" అంటూ లేచాడు. అసిరిగాడు ఉయ్యాల్లోంచి నల్ల గుమ్మడికాయలాంటి పిల్లణ్ణి తీసి ఎత్తుకున్నాడు. పిల్లడు కిరకిర కొట్టుకుంటూ గుక్కపెట్టి ఏడ్చాడు.

"ఆరే చిమాద్దిరీ, నాకాడికి రావా?" అంటూ పెద చప్పుడుతో అసిరి గాడు ముద్దెట్టుకున్నాడు.

"ఓ రసిరిగ, కురుపు రేపేసినావురా! ఇలా తే పిలాణ్ణి!" అని అందుకుంది అంకి.

"కురు పెక్కడ?" అన్నాడు అసిరిగాడు.

"మొన్న నొద్దంటూ ఉంటే ఇనసపెట్టరు టీకాలు పొడిచేసినాడు. జొర మీ పొద్దే తగ్గినాది. రాత్తిళ్ళు బాధతో సచ్చిపోతున్నాం."

అసిరిగాడు టీకాలు చూశాడు.

"ఇంకా మొగ్గరంగా ఉన్నాయి. పసుపెట్టు! మా వోడికి నిరుడావి డికి టీకాలేయించినాం" అన్నాడు.

"ఔనుగాని అసిరిగా! మొన్న సొపనమొచ్చింది. అదెవరో అంట. ఎందుకొచ్చినావు కావు అనడిగినాడు. తెలివొచ్చి పనకాయించి సూస్తే ఏటి నేదు! గుండె జల్లుమంది. మావోళ్ళ నడిగితే చిమాద్దిరప్పన్న అన్నారు. అదేటో నీకు తెలుసునా?"

"మొక్కుకున్నా రేటి?"

"కుర్రాడికి బాగునేకపోతే మొక్కుకున్నాముకాదా?"

"ఐతే ఇకనేం? ఎళ్ళండి. ఎంటనే. దేముడితో పరాచికాలు కాదు. ఈఏొద్దు పైడితల్లి పదేను రూపాయిలు పుచ్చుకొంటాడు."

పైడితల్లి పొగాకుబొండాం విప్పి చుట్టలు చుట్టుకొంటున్నాడు.

"నీకేం కబుర్లు సెపుతావు. ఆరు రూపాయిలు ఖరుసవుతుంది. ఎట్టుకోవొద్దా?" అన్నాడు పైడితల్లి.

"పదేను రూపాయిలొస్తే ఆరురూపాయి లెట్టుకోలేవా?" అన్నాడు అసిరిగాడు.

"అంతా అగ్గిమీద గుగ్గిలమేసేవోళ్ళే, అది మొక్కుకోడ మెలాగుందో నువ్వు ఎళ్ళమండ మలాగుంది!" అన్నాడు పైడితల్లి.

"లెంపలోయించుకో! దేముడితో పరాచికాలు కాదు!" అన్నాది అంకి.

"లెంపలోయించుకోనా? ఇదిగో వోయించుకొన్నాను. సరా? పిల్లడికేటీ నేదురా! రెండు తుమ్ములు తుమ్మినాడు సరి, మొక్కిసింది. ఇనాగైతే ఎవడి తరం? దేముడితో పని! తప్పదెళ్ళాలి!" అన్నాడు పైడితల్లి.

గుఱ్ఱెడుతూ అంకి గుండెమీద పిల్లడు నిద్దరపోయాడు.

"నిద్దరొచ్చిందా? అమ్మా, నీకు నిద్దరొచ్చిందా? మా బాబు రేపు చిమాచెలం ఎళతారేటి? కొండ ఎక్కుతారేటి? అబ్బో అబ్బో! ఈ బాబు రెయ్యిలుబండి ఎక్కుతారా? రెయ్యిలుబండి ఝుఫ్‌ఝుఫ్..." అంటూ పిల్లణ్ణి మళ్ళా అంకి ఉయ్యాల్లో పెట్టింది.

చుట్టలు చుట్టుకొని పైడితల్లి లేచి చూరుమీది తాపి తీశాడు. అసిరి

గాడు చెవులో చుట్టతీసి నోట్లో పెట్టి జేబులో అగ్గిపెట్టె తీశాడు.

"మామాఁ సూడు అసిరిగోడు అగ్గిపెట్టె తీసినాడు!" అన్నాది అంకి.

అసిరిగాడు పుల్లతీసి వెలిగించబోయాడు.

"ఎలిగించ కుండు; కుంపట్లో అగ్గినిప్పుండగా అగ్గిపెట్టె తీసినాడు! ఊరకొచ్చిందిరా అగ్గిపెట్టె? కొంప లినాగే కూలిపోవటం!" అని కుంపట్లోంచి అగ్గి తొర తీసి ఇచ్చింది.

"అంకీ, రేత్రికి సేప లొట్టుకురా!" అన్నాడు పైడితల్లి.

"ఇయేళ సేపలు కొనాలా? నావొల్లకాదు బాబూ ఈః సంసారం! నిన్న పావలా డబ్బులిచ్చినావు, బియ్యమేటి తెమ్మన్నావు? కూరేటి తెమ్మన్నావు? ఈః పొద్దు సేప లెక్కన్నుంచి తెమ్మన్నావు?" అంది అంకి.

"ఓ లేవడికాడేనా ఉచ్చుకోయే!" అన్నాడు పైడితల్లి.

"ఉచ్చుకోనా! అప్పుచేసి కొప్పుసవరం. ఈఃపొద్దు గోగాకుపులుసుకి గతి నేదు!"

"సందేళ నానే బజారుకెళ్ళి వొంజిరం తెత్తాను."

"నువ్వేటీ తేవొద్దు. డబ్బంతా నాసేతు లెట్టకపో! నీపని సెపుతాను. సవళ్ళూ తెత్తావు వొంజిర ముక్కలూ తెత్తావు!"

మేస్త్రీలు వెళ్ళిపోయారు. తాపీగా రెండు గంటలు కూచుని అంబలి తిని అంకి పడుకుంది. లేచేసరికి సూర్యుడు వాలిపోయాడు. రోడ్లనిండా వసంతంలాగ ఎండ వొలికింది. బియ్యపుచీటీ తీసి బుట్టతీసి, చంకలో పిల్లాణ్ణేసుకుని బజారుకి వెళ్ళింది. ఉప్పుగళ్ళ, మిరపకాయ, చేపా, జెల్లా కొంది. కాణీ కొబ్బరుండ కొని తింటూ చిన్నముక్క పిల్లడికి పెడుతూ గుడిసెకొచ్చింది.

చీకటి పడ్డాది. పిల్లడు కేకలు పెడుతూ గుడిసంతా బంగురుతున్నాడు. అంకి అరికాల్లో దురదేసింది.

"బాబూ, మనం చిమాచెలం ఎళతాము" అని కొడుకుతో చెప్పింది. కొడుకు బోసినవ్వు నవ్వేడు. అంకి అరచెయ్యి దురదేసింది.

"బాబూ, నా అరసెయ్యి దురదేత్తున్నాది. మీయయ్య డబ్బు తెత్తాడు. నా సేతులో డబ్బు పడతాది. కొండెక్కుతాము. ఏం?" అని

కొడుకు నడిగింది. కొడుకు బోసినవ్వు గుడిసంతా మతాబాలాగ వెలిగించి.

అంకి పొయ్యంటించి చేపలకూర మొగుడికి హితవయినట్టు వొండింది. వంట పూర్తికాగానే కాళ్ళూ చేతులూ కడుక్కొని కొప్పు సవరించుకొని, మొగుడు ఎప్పుడు వస్తాడని చూస్తూ అరుగుమీద కూచుంది. వాసకసజ్జిక.

ఎంత రాత్రయినా పైడితల్లి ఇల్లు చేరలేదు. అసిరిగాడు తప్ప తాగి తందనాలు తొక్కుతూ వీధిలో కొచ్చాడు.

"అంకీ, పైడితల్లీ మేమూ తాగీసినాము. దిమ్మద్దిరప్పన్న మొక్కు సారాకొట్లో తీర్చేసినాము!" అని చెప్పేడు.

"ఓలమ్మా తాగీసినారే!" అని అంకి గుడ్లలో నీరు నింపుకొంది.

అసిరిగాడికీ, బండి రామయ్యకీ పెద్ద జట్టీ అయిపోయింది. అసిరిగాడు రామయ్యకి అరణాలు బాకీ. వాడు బాకీ డబ్బులడిగేడు. "నేనివ్వను నీ తాతతో చెప్పుకో" అన్నాడు అసిరిగాడు.

అసిరిగాడు తాగి పిచ్చెత్తి ఉన్నాడు. రామయ్య తాగుడులేక పిచ్చెత్తి ఉన్నాడు. ఇద్దరూ జుత్తులు పట్టుకొని కలబడ్డారు. వీధి వాళ్ళంతా విడిపించారు. అసిరిగాడి పెళ్ళాం కణికి లబోలబోమని, నెత్తీ నోరూ కొట్టుకుంటూ వొచ్చింది.

"వొగ్గండి నన్ను. ఇయేళ ఆడో నేనో కడతేరిపోవాలి!" అని గింజుకుంటున్నాడు రామయ్య. కణికికి సంసారం దుర్భరమైంది.

"ఇదేనా నీ వాళకం? ఇంట్లో ఏటీ నేదు. ముణ్ణాళ్ళాయి ఏటి తింటున్నామో పాణాలతో ఎనాగ నిలబడి ఉన్నామో బగవంతుడి కెరుక. మొన్న తాగీసినాడు. నిన్న తాగీసినాడు. ఈ పొద్దు తాగీసినాడు. ఈడి బుర్రబడిపోను!" అంటూ కణికి ప్రారంభించింది.

పట్టుకున్న వాళ్ళని ఒక్క దులుపుతో విడిపించుకొని అసిరిగాడు పెళ్ళాంమీద పడి దాన్ని దబదదబడ చితకతన్నడం ప్రారంభించాడు.

"అంకీ!" అని గట్టిగా ఆబోతురంకె వేస్తూ పైడితల్లి వచ్చేడు.

"అంకీ, పదేనురూపాయి లొచ్చినాయి. రెండు మల్లు చొక్కాలు కుట్టించినాను. ఒక పంచె కొన్నాను. తరువాత తాగీసినాము. అసిరిగోడు,

యంకట్రామయ్య, పొట్టి ఎదవ, దాలిగోడు, చిన్నోడు కలిసి తాగిసినాము. హి హ్వి హ్వి!" అని నవ్వేడు.

"పోన్నే!" అంది అంకి.

"డబ్బుకేటినే ఎదవడబ్బు. నలుగురు తాగినాం."

"ఆళ్ళందరికి కూడా ఎడితే మన దినం ఎళతాదా?"

"నీకేటో అంకి! నువ్వు మేస్త్రీ పెళ్ళాంవి. మనం నాలుగురోజులు కష్టపడితే నెల్లాళ్ళకూడు!" అని అంకి ముక్కుపట్టుకున్నాడు.

"చాలు సరసం, ఎల్లు!"

"ఎక్కడ కెళ్ళమన్నావు? సారాముండ దగ్గరికెళ్ళ మన్నావు? దాని జుట్టూ, దాని కట్టూ బలేగా ఉంటాయి. దానిపేరు మాణిక్యం. సీ! నే నలాటోణ్ని కాదు. ఎవడి నడుగుతావో అడుగు. పెళ్ళాలుండగా ఎదవ బుద్ధులు తప్పని అందరినీ తిడతాను."

"ఎనక కల్లు, సారా దుకాణాలెత్తేస్తారనుకొన్నారు. ఎత్తీసినా బాగుణ్ణు!" అని అనుకొంది.

"ఏటన్నావు? కల్లుపాకలు పీకేస్తారనా? నాను పెద్దోళ్ళకాడ తిరుగుతున్నాను. ఎనక కొన్నిసోట్ల మనోళ్ళే కల్లు దుకాణాలు పీకించీసినారు. ఇప్పుడు మళ్ళా గవర్నమెంటోళ్ళు అక్కడా కల్లు, సారా అమ్ముతున్నారు. ఇదెవడి రాజ్జెం అనుకొన్నావు? మా కడ్డునేదు. మా కేటో అంకి?"

"ఔన్నే మంచిపనీనోకంలో ఎవడూ సెయ్యడు."

"కూకుని కబుర్లు సెపతావేటి? నెగు, కూడు తినాలి?"

"కడుపునిండా కూడే. నానీ పొద్దొండనేదు."

పైడితల్లి గుడిసెలో దూరేడు. ఆసిరిగాడు జట్టితో గూడెం గొల్లుమంటున్నాది. పైడితల్లి కూరకుండని పట్టుకుని బైటికొచ్చాడు.

"సేపలకూరొండినా? వొండనన్నావు?" అన్నాడు.

"సెపలసిత్తందాన్ని, నీకు సెయ్యకపోతే ఇంకెవ్వడికి సెయ్యమన్నావు? నీ మొక్కుబడి అయినాకే అన్ని మొక్కులూ! లోపలికినడు కుండట్టుకుని ఈదిలోకొచ్చావు!" అని లేచింది.

"అప్పన్న కొండకి ఎప్పుడెల్లినగాని—" అని పాడుకొంటూ పైడితల్లి పిల్లిలాగ ముడుచుకుని తిండికి కూచున్నాడు.